## విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999



# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక


## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

**బయటకు రావాలంటే భయపడతున్న జనాలు**



**న్యూఢిల్లీ,మే23చట్టం న్యూస్ :** దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ

మిగతా 2వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 129 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi ఆదివారం 24 మే 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు



**టెహ్రాన్,మే23 చట్టం న్యూస్:** పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య

మిగతా 2వ పేజీలో..

## వైఎస్ కుటుంబానిది రక్త చరిత్ర

**ఫ్యాక్షన్ రాజకీయాలు వారితోనే మొదలు**

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల కేశవ్**



**అమరావతి,మే23 :చట్టం న్యూస్** ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబం అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావులతీవ్రంగా విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి అకృత్యాలను వివరించారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బాధితుడు కాదని.. నిందితుడంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తారన్నారు. వివేకా హత్య కేసులో

మిగతా 2వ పేజీలో..

## యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

**యాదగిరిగుట్ట,మే23 చట్టం న్యూస్:** యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో

మిగతా 2వ పేజీలో..



## కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

**ప్రస్తుత పరిస్థితుల్లో హాజరు కాలేనన్న ట్రంప్**



**వాషింగ్టన్,మే23 :** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక

మిగతా 2వ పేజీలో..

## ట్విశా శర్మ మృతిలో వీడని మిస్టరీ

**ఆత్మహత్యకు ముందు సెలూన్‌ను సందర్శించినట్లు గుర్తింపు**



**ముంబై,మే23 :** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాజీ మిస్ పుణె, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ మృతి కేసుకు సంబంధించి పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె ఇంట్లో ఉరివేసుకుని కనిపించడానికి కొన్ని గంటల ముందే ఓ సెలూన్ షాప్‌ను సందర్శించింది. సంబంధిత సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది. సుమారు 3 గంటలసేపు సెలూన్‌లో ఉన్న ట్విషా.. హెడ్ మసాజ్, పెడిక్యూర్ చేయించుకున్నట్టు కనిపిస్తోంది. ట్విషా.. మే 12న మధ్యాహ్నం 3:12 గంటల ప్రాంతంలో సెలూన్‌లోకి వెళ్లి, సాయంత్రం 6:15 గంటలకు

మిగతా 2వ పేజీలో..

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

- నియోజకవర్గ అభివృద్ధి
- తదితరాలపై చర్చ
- అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన



**అమరావతి,మే23 :** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని

మిగతా 2వ పేజీలో..

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసలు సంపద
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని
- కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు





**చిత్తూరు,మే24 చట్టం న్యూస్:** ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు.

ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే

మిగతా 2వ పేజీలో..

## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని ఢీకొన్న క్రూజర్..ఐదుగురు దుర్మరణం**

**బెంగళూరు,మే23 చట్టం న్యూస్ :** కర్ణాటకలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాడ్లాపూర్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వెళ్తున్న క్రూజర్ వాహనం ముందున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాడ్లాపూర్ దగ్గర లారీని క్రూజర్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. మృతులను క్యాష్వార్, హుస్సేన్, అలీ, రసూల్, ఫాతిమాగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రూజర్ వాహనం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా కుటుంబంలోని ఐదుగురు మృతిచెందడంతో బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేగం,

మిగతా 2వ పేజీలో..

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన**

**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**

**న్యూఢిల్లీ,మే24 :** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఉఃుజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు

మిగతా 2వ పేజీలో..

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

**జీవితాంతం గుర్తుండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్**



**న్యూఢిల్లీ,మే24 చట్టం న్యూస్:** కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ

మిగతా 2వ పేజీలో..

# జగన్ కుటుంబ రాజకీయం అందరికీ తెలిసిందే

- ఇప్పుడేమో అహింసావాదిలా పోజులు కొడుతున్నాడు
- వారు ఎన్ని హత్యలు చేశారో రాయలసీమ గడపగడపకూ తెలుసు
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి,మే24 :** గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా తాను చాలా అమాయకుణ్ణి, అహింసావాదిని అంటూ మాట్లాడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ చురకలు వేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పూర్వీకుల చరిత్ర, ఆయన చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దారుణాలు చేశారో, ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని వ్యాఖ్యానించారు. అటువంటి రాజారెడ్డి పోలికలు తనకొచ్చాయని చెప్పుకున్న వ్యక్తి జగన్ అంటూ దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు కళ్లారా చూశామని మంత్రి అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. తన వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చారని జగన్‌పై మంత్రి ఆరోపణలు గుప్పించారు. పరిటాల రవితో సహా ఎంతోమందిని హత్య చేశారన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఏమైందో అందరికీ తెలుసన్నారు. 'తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడు.. అతని వ్యక్తిత్వం అలాంటిది' అంటూ వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే.. తన పార్టీ ఎంపీని కాపాడేందుకు సీబీఐ అధికారులపైనే దాడి చేసి తరిమేశారని మండిపడ్డారు. వైఎస్ సునీత ఆవేదన కనిపించటం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా చేసిన ఐదేళ్లలో బాబాయ్‌ను హత్య చేసిన వ్యక్తిని కనుక్కోలేకపోయారా అని నిలదీశారు. తప్పుదోవ పట్టిద్దామనుకుంటే నమ్మే స్థితిలో ఏపీ ప్రజలు లేరన్నారు. ఇప్పుడు ఆ 11 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. 'ఈరోజు రాష్ట్రం సుభిక్షంగా ఉంది. పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. యువత హ్యాపీగా ఉంది. ఉద్యోగాలు వస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందన్న ఆనందంలో ప్రజలు ఉన్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

మొదటి పేజి తరువాయి..
కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

## కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

మొదటి పేజి తరువాయి..
బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

## ట్విశా శర్మ మృతిలో వీడని మిస్టరీ

మొదటి పేజి తరువాయి..
బయటకు వెళ్లారని సెలూన్ షాప్ యజమాని కిరణ్ పారిహార్ తెలిపారు. ఆ తర్వాతి రోజు ట్విషా అత్త గిరిబాలా సింగ్ ఆమె వివరాలపై పదే పదే ఆరా తీశారన్నారు. 'ట్విషా శర్మ.. మా సెలూన్‌కు తరచుగా వస్తుంటారు. గతంలోనూ ఆమె నాలుగైదుసార్లు వచ్చారు. అయితే.. ఈసారి సుమారు 9 నెలల విరామం తర్వాత వచ్చారు. మరుసటి రోజు ఉదయం గిరిబాల సింగ్.. ట్విషా సెలూన్‌కు వచ్చినప్పటి సీసీటీవీ ఫుటేజీ కావాలని ఫోన్ చేశారు' అని కిరణ్ చెప్పారు. తన కోడలు ట్విషా.. సెలూన్‌కు ఎప్పుడు వచ్చిందో, ఏ సమయంలో తిరిగి వెళ్లిందో స్పష్టంగా తెలపాలని గిరిబాలా సింగ్ కోరినట్టు షాప్ యాజమాని చెప్పారు. అలాగే ఆమె ఏ రకంగా డబ్బు చెల్లించారో.. ఆమె సెలూన్ సందర్శనకు సంబంధించి ఏదైనా ప్రూఫ్ లేదా రికార్డ్స్ కావాలని ఆమె పదే పదే అడిగారన్నారు. అయితే.. ట్విషా ఆ సమయంలో తనకు ఎలాంటి నగదు చెల్లించలేదని, గతంలోనే ప్రీపెయిడ్ ప్యాకేజీ తీసుకున్నారని పారిహార్ చెప్పారు. ఆ తర్వాత గిరిబాలా నుంచి మరోసారి ఫోన్ వచ్చిందని.. ట్విషా యోగక్షేమాల గురించి అడగ్గా.. ఆమె చనిపోయారని సమాధానమిచ్చినట్టు యజమాని చెప్పుకొచ్చారు. కాసేపటికే లాయర్ వస్త్రధారణతో కూడిన ఐదారుగురు వ్యక్తులు తన షాప్ వద్దకు వచ్చి.. తాము అడ్వకేట్లమని పరిచయం చేసుకుని సీసీటీవీ ఫుటేజీ తీసుకెళ్లారని పేర్కొన్నారు. అయితే.. తాము న్యాయవాదులమని చెప్పుకున్న ఆ బృందంలోని సభ్యుల గుర్తింపులు తెలియరాలేదు. దీంతో ట్విషా శర్మ మృతికేసు ఇంకా మిస్టరీగానే ఉంది. పోస్ట్‌మార్టం నివేదిక, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం.. ట్విషాది ఆత్మహత్యేనని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ట్విషా మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే.. పది రోజులుగా పరారీలో ఉన్న భర్త సమర్థ్ సింగ్‌ను ఎట్టకేలకు పోలీసులు మే 22న అరెస్ట్ చేశారు. అతణ్ని కోర్టులో హాజరుపరచనున్నారు.

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

మొదటి పేజి తరువాయి..
రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజి తరువాయి..
నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రాణాంతకమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

మొదటి పేజి తరువాయి..
చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

మొదటి పేజి తరువాయి..
రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి



సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు–నగరి, మల్లెమడుగు, సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# వైఎస్ కుటుంబానిది రక్త చరిత్ర

మొదటి పేజి తరువాయి..
ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడని.. అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారని అంటూ దుయ్యబట్టారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయని.. రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారని మంత్రి మండిపడ్డారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచిందని ఆరోపించారు. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని.. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారని.. ఇదీ రాజారెడ్డి చరిత్ర అని చెప్పుకొచ్చారు. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదన్నారు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు సృష్టించుకోవడం అనేది వైఎస్ కుటుంబంతోనే మొదలైందని అన్నారు. కడప జిల్లాలోని లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయపెట్టి లొంగదీసుకున్నారని పయ్యావుల ఆరోపించారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయన్నారు. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ కంట్రోల్‌లోకి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబం మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టిందని తెలిపారు. రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారని.. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయినా పట్టించుకోరని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డి ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరని దుయ్యబట్టారు. 'నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్' అని స్పష్టం చేశారు. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారని పయ్యావుల కేశవ్ తెలిపారు. జగన్ ఉపాధి అవకాశాలను పోగొడుతున్నారని మండిపడ్డారు. 800 కంపెనీలను గ్రౌండ్ చేయబోతున్నామన్నారు. 'వ్యవస్థల మీద గొడ్డలి పోటు వేశావ్.. పోలవరం మీద గొడ్డలి వేటు వేశావ్.. పరిశ్రమల మీద గొడ్డలి వేటు వేశావ్.. అందుకే మీది గొడ్డలి పార్టీ. అచ్చెన్న అరెస్ట్ నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు భయం సృష్టించే ప్రయత్నం చేశారు. పొ÷–లకెయిన్లతో జగన్ విధ్వంసం చేస్తే... నిర్మాణానికి పొ÷–లకెయిన్లను వాడుతున్నాం. నేరం జగన్ నైజం.. నేరమయ రాజకీయాలను గతంలో వైఎస్ కుటుంబం మొదలు పెట్టింది.. దాన్ని జగన్ కొనసాగిస్తున్నారు. వివేకాను చంపిందెవరో సునీతమ్మ చెబుతోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి వెనుక రిలయన్స్ ఉందన్నారు. తిరిగి వారికే రాజ్యసభ పదవి ఇచ్చారు. వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని బొత్స అన్నారు. దానికి సమాధానం చెప్పగలరా..? వైఎస్‌ఆర్‌ను ముద్దాయిగా చేసింది జగనే అని ఉండవల్లి అరుణ్ కుమార్ స్వయంగా చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిగా చేర్చిన పొన్నవోలుకు పదవి ఇచ్చి గౌరవించారు. పాదయాత్రలో అస్వస్థత గురైనప్పుడు విజయమ్మ వెళ్లారు కానీ... జగన్ వెళ్లలేదు. వైఎస్ మరణం వెనుక ముందుగా విచారించాల్సింది జగన్ మోహన్ రెడ్డినేనని లగడపాటి అన్నారని గుర్తు చేశారు. యువకులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని.. ఎవరి చరిత్ర ఏంటో.. యువకులు తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం చంద్రబాబు పరిశ్రమలు తెస్తున్నారని... జగన్ పరిశ్రమలను తరిమేశారంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు


మొదటి పేజి తరువాయి..
చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.
2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ–ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ–ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 23 ,(చట్టం బ్యూరో) :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లా అభ్యర్థులకు విప్ ఆది శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి 99 రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ మేళాలను నిర్వహిస్తోందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో గ్రూప్–1, ఉపాధ్యాయ నియామకాలు సహా పలు ఉద్యోగ నియామక ప్రక్రియలు చేపట్టామని మరిన్ని ఉద్యోగ నియామకాలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని వారి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని, పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని, యువతి యువకులు ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

మొదటి పేజి తరువాయి..
కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

మొదటి పేజి తరువాయి..
కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 19వ జాతీయ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాలను పంపిణీ చేసిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు 19వ జాతీయ రోజ్‌గార్ మేళా సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 51,000 మందికి పైగా నూతనంగా ఎంపికైన యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా 47 కేంద్రాలలో ఒకేసారి నిర్వహించిన ఈ కార్యక్రమం ఉపాధి కల్పన, యువ శక్తి సాధికారత మరియు దేశ నిర్మాణం పట్ల భారత ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబించింది. నూతనంగా నియమితులైన అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి “నాగరిక దేవో భవ” అనే మంత్రాన్ని ప్రస్తావించారు. “నాగరిక కళ్యాణం” ప్రతి ప్రజాసేవకుని ప్రధాన ధ్యేయంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. యువత అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత భారత్) 2047 లక్ష్య సాధనలో తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



విశాఖపట్నంలో రోజ్‌గార్ మేళాను రైల్వే శాఖ ఆధ్వర్యంలో ××వీ, విశాఖపట్నంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లలిత్ బోహ్రా అధ్యక్షత వహించారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ శ్రీ ఎం. చంద్రశేఖర్, డైరెక్టర్ (పీ ఉ ఎల్) శ్రీ ఎస్.ఎస్. శ్రీనివాసరావు మరియు ఇతర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైల్వేలు, విద్యా శాఖ, తపాలా శాఖ, భారత నౌకాదళం, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు మరియు మంత్రిత్వ శాఖలలో నియామకాలు పొందిన 190 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. శ్రీ లలిత్ బోహ్రా నూతన నియామకులందరికీ అభినందనలు తెలియజేస్తూ, తమ విధుల నిర్వహణలో అత్యున్నత స్థాయి నిజాయితీ, వృత్తి నైపుణ్యం మరియు ప్రజాసేవా భావాన్ని పాటించాలని సూచించారు. తమ సంస్థల్లో కృషి, అంకితభావం మరియు నైతిక విలువల ద్వారా గౌరవాన్ని సంపాదించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మరియు గౌరవంగా వ్యవహరించాలని కోరారు. ఈ 190 మంది అభ్యర్థులు భారత ప్రభుత్వంలోని రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ, ఉన్నత




విద్యా శాఖ తదితర విభాగాలలో తమ సేవలను అందించనున్నారు.

రోజ్‌గార్ మేళా భారత ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలలో ఒకటి. దీని లక్ష్యం ఉపాధి కల్పనను వేగవంతం చేయడం మరియు దేశ యువతకు అర్థవంతమైన ఉద్యోగ అవకాశాలను అందించడం. ఇప్పటివరకు నిర్వహించిన 19 రోజ్‌గార్ మేళాల ద్వారా సుమారు 12 లక్షల నియామక పత్రాలు పంపిణీ చేయబడ్డాయి. ఇది సమర్థవంతమైన, నైపుణ్యవంతమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మానవ వనరుల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సూచిస్తుంది.

# ఢిల్లీ కేంద్రంలో రైతులను చంపి,కరీంనగర్ లో రైతుల పట్ల మొసలి కన్నీరా?

- బండి భగీరథ్ కేసును ప్రజల దృష్టి మరల్చడానికే ధర్నాలు
- బిజెపికి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు
- సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 23 ,(చట్టం బ్యూరో) :** ఈరోజు కరీంనగర్ లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం మాట్లాడుతూ శుక్రవారం రోజున రైతు సమస్యలపై బిజెపి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. హర్యానా పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల రైతులు ఢిల్లీ కేంద్రంలో రైతులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంవత్సరం పాటు శాంతియుతంగా ధర్నా చేస్తే 1200 మంది రైతులను పట్టణ పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, రైతుల ఆందోళన, పోరాటాన్ని అణిచివేస్తూ ముళ్లకంచెలు వేస్తూ, ట్రాక్టర్లతో తొక్కిస్తూ, వాటర్ స్ప్రే చేస్తూ టియర్ గ్యాస్ పేలుస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి కరీంనగర్ లో రైతు సమస్యల పట్ల ముసలి కన్నీరు కారుస్తూ ధర్నా చేస్తున్నారని అన్నారు.

నిజంగా రైతుల పైన ప్రేమతో చేసే ధర్నా కాదని బండి సాయి భగీరథ కేసు మూలంగా బిజెపి ప్రజలకు ముఖం చూపించలేకపోయిందని, ఆ కేసులో ప్రజల దృష్టి మరల్చడానికే రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని అన్నారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేసి అనేకమంది రైతులను పొట్టలు పెట్టుకున్న బిజెపికి

రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు. గడిచిన 10 రోజులలో డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలు పెంచి రైతుల పైన తీవ్రవారాలు వేశారని, పెట్రోల్ ధరల మూలంగా పేద సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా,విజయ్ మాల్యా,నీరవ్ మోడీ, లలిత్ మోడీ లాంటి కార్పొరేట్ వ్యక్తులకు రుణాలు ఇస్తూ దేశ సంపదలను కొల్లగొడుతున్నారని అన్నారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సకాలంలో ఎరువులు, మందులు అందించాలని పంట నష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా భీమా సౌకర్యం కల్పించి, పంట కొన్న వెంటనే డబ్బులు చెల్లించాలని ఆ దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం పనిచేయాలని అన్నారు.

ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు పున్నం రవి, నాయకులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోటలో భారీ వర్షం !

- డ్రైనేజీ పూ డు కు పో వడం వల్ల రోడ్డుపై పారుతున్న మురుగు నీరు
- కరెంటు తీగలు తెగిపోవడం వలన స్తంభించిన విద్యుత్
- రోడ్డుపై చెట్లు విరిగిపడి ట్రాఫిక్ అంతరాయం



**మహబూబ్ నగర్ 23 మే 2026( చట్టం న్యూస్) :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో సాయంకాలం ఈదురుగాలు ఉరుములతో భారీ వర్షం కురిసింది.

పట్టణంలో లక్ష్మీ టాకీస్ ( సాయిరాం ఫంక్షన్ హాల్) దగ్గర రోడ్డుపై వేప చెట్టు విరిగి అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన రోడ్డుపై ము రుగు నీరు ప్రవహించింది. పాదాచారులు రోడ్డుపై నడవాలంటే మురగ నీటిలో తడవాల్సింది సంబంధిత మున్సిపాలిటీ అధికారులు తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను పూడిక శుభ్రం చేసి వెంటనే రోడ్డుపై మరుగునీరు రాకుండా చర్యలు తీసుకొని మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాహుల్ హాస్పిటల్ డ్రైనేజీ నీరు పొంగి హాస్పిటల్ లోపల ము రుగునీరు నిండడంతో రోగులకు చాలా ఇబ్బందిగా అవస్థలు పడ్డారు. పేషెంట్ తరపు వాళ్ళు లోపలికి మొరుగునీటిలో తడవాల్సిందే ఇప్పటికైనా మునిసిపాలిటీ సిబ్బంది మరియు కమిషనర్ రాహుల్ హాస్పిటల్ పక్కన డ్రైనేజీ వ్యవస్థ వర్షపు నీరు డ్రైనేజీలో వెళ్ళుటకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో పలుచోట్ల వీధుల్లో వర్షపు చుక్క పడింది అంటే రోడ్డుపై మరుగు నీరు పొంగి ప్రవహిస్తుంది వెంటనే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి పట్టణ ప్రజలకు వ్యాధుల బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

-------

# ముదిరాజ్ కులస్థులను బీసీ-ఏ (BC-A)లో చేర్చవద్దు ;





**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/మే 23 ,(చట్టం బ్యూరో) :** ముదిరాజ్ కులస్థులను బీసీ–డి (BC-D) గ్రూప్ నుండి బీసీ–ఏ (BC-A) గ్రూప్‌లోకి మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

?బీసీ–ఏ గ్రూప్‌లో ఉన్న కులాలు ఇప్పటికే తీవ్ర వెనుకబాటుతనానికి గురై, సరైన ఉపాధి లేక, జీవనోపాధి కరువై ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థికంగా, సామాజికంగా ఎంతో సంపన్న వర్గానికి చెందిన ముదిరాజ్‌లను తీసుకువచ్చి బీసీ–ఏ లో కలపడం వల్ల, ప్రస్తుతం ఈ గ్రూప్‌లో ఉన్న పేద కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కాబట్టి ముదిరాజ్‌లను బీసీ–డి నుండి బీసీ–ఏ కి మార్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బీసీ–ఏ లో ఉన్న 57 కులాలు విద్యా, ఆర్థిక, రాజకీయంగా తీవ్ర వెనుకబాటుతనంతో జీవిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఈ సమావేశంలో బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గడప కోటేశ్ కుమార్ (గంగపుత్ర)తో పాటు జిల్లా సెక్రటరీ జంపాల నర్సయ్య (నాయిబ్రాహ్మణ), ట్రెజరర్ జంగం సురేశ్, (నాయిబ్రాహ్మణ) శ్రీరాముల రమేశ్ , అలిపి రెడ్డి లచ్చయ్య (మేదరి), ఏకుల రమేశ్ (మేదరి), శంకర్ (రజక) తదితరులు పాల్గొన్నారు.

# బెంగుళూరులో కాక్రోచ్ జనతా పార్టీ

### నేడు మానవహారం అంటూ వెలసిన పోస్టర్లు అలాంటిదేమీ లేదంటూ పోలీసుల కొట్టివేత

బెంగళూరు,మే23(ఆర్ఎన్ఎ): సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో మే 24న బెంగళూరులో మానవహారం నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'బొద్దింకల జనతా పార్టీ కర్ణాటక' పేరుతో విడుదలైన పోస్టర్‌లో టౌన్ హాల్ సమీపంలో శాంతియుత మానవహారం చేపడతామని పేర్కొన్నారు. 'బొద్దింకల శక్తి ఆన్‌లైన్‌లోనే కాదు, వీధుల్లో కూడా ఉంది' అని పోస్టర్‌లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని బెంగళూరు పోలీసులు స్పష్టం చేశారు. మానవహారం నిర్వహించేందుకు ఏ వ్యక్తి, సంస్థ లేదా రాజకీయ పార్టీ నుంచి ఇప్పటివరకు దరఖాస్తు రాలేదని తెలిపారు. టౌన్ హాల్ పరిసరాల్లో అనుమతి లేకుండా గుమికూడవద్దని, సోషల్ మీడియాలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సందేశాలను షేర్ చేయవద్దని హెచ్చరించారు. నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై వ్యంగ్యంగా స్పందిస్తూ 'బొద్దింకల జనతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభమైంది. ఈ పేరుతో ప్రారంభమైన ఎక్స్ ఖాతా కొద్ది రోజుల్లోనే వైరల్‌గా మారింది. అనంతరం ఆ ఖాతా నిలిపివేయబడినప్పటికీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సీజేపీకి భారీ స్థాయిలో ఆదరణ లభించింది. కొద్ది రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 1.85 కోట్ల ఫాలోవర్లను సంపాదించి, ప్రధాన రాజకీయ పార్టీల అధికారిక పేజీలను అధిగమించింది. పుణెకు చెందిన అభిజీత్ దీప్కే అనే యువకుడు ఈ ఖాతాను ప్రారంభించారు. ఖాతా నిలిపివేసిన తరువాత తనకు ప్రాణహాని బెదిరింపులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

# బహుమతుల ప్రదానం



**కొడిమ్యాల, మే 23(చట్టం) :** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వేసవి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నీలో కొడిమ్యాల సన్ రైజెస్ జట్టు విజేతగా, నమిలికొండ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి గ్రామ ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సన్ రైజెస్ జట్టుకు కొడిమ్యాల రేణుక ఫుట్ వేర్ తరపున 10 వేల రూపాయల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు కొడిమ్యాల బెంగళూరు బేకరీ తరపున 5 వేల రూపాయల నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్, ఐఏఎస్
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్






**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మే 23 ,(చట్టం బ్యూరో) :** భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ ఎస్ లోకేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై శనివారం హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డీ ఎస్ లోకేష్ కుమార్ ఐఏఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూ లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, సబ్ రిజిస్ట్రార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# కొదురుపాకలో కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్‌కు ఘన సన్మానం

- బోయినిపల్లి ప్యాక్స్ చైర్మన్ శ్రీ జోగినపల్లి వెంకటరామారావు గారి ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ
- పాల్గొన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు

**బోయిన్ పల్లి మండలం / మే 23 ,(చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ గారికి ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. గ్రామ సీనియర్ నాయకులు వెంకట రామరావు ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కొదురుపాక గ్రామ ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు మరియు రజక సంఘం సభ్యులు, స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా మండల పగ్గాలు చేపట్టిన సువీన్ యాదవ్ గారికి వారు, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యావంతుడు, నిబద్ధత కలిగిన యువ నాయకుడు సువీన్ యాదవ్ గారి నేతృత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, అందరినీ సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.

# విజేతలకు బహుమతుల ప్రదానం

**కొడిమ్యాల, మే 23(చట్టం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి చెస్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో చెస్ విభాగంలో జక్కని గౌతంకృష్ణ, బ్యాడ్మింటన్ విభాగంలో కట్టేకోల హర్షిత్ లు విజయం సాధించారు. జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.రాజగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్వో డాక్టర్ కోరుకంటి రవికుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ వాణి, కోచ్, ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో ఎ. శ్రీనివాస్, ఎంపీడీవో స్వరూప, ఎస్సై సందీప్, హెచ్ఎం విజయేందిర లు అభినందించారు.



# ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

## రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల

**నిజామాబాద్,మే23 :** పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్ము కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

### శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా

### ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు

**మెదక్,మే23 :** రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

### ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

### హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్

**హైదరాబాద్,మే23 :** బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారన్ని ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

# వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు

### వైఎస్ మరణం ఎలా జరిగిందో అందరికీ తెలుసు

### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ అనకాపల్లి ఎంపి సిఎం రమేశ్

అమరావతి,మే23 : పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ధి కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు.

# జాతీయ రహదారిపై ఆర్టీసి బస్సు, కారు ఢీ

### ఒక మహిళ మృతి..పలువురికి గాయాలు

అంబేద్కర్ కోనసీమ,మే24 : ముమ్మిడివరం మండలం అనాతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. 216వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజోలు నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ బస్సు వెళ్తోంది. కాకినాడ నుంచి మామిడికుదురుకు కారు ప్రయాణిస్తోంది. రెండు వాహనాలు అనాతవరం దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ బాధితుల్లో ఓ మహిళ మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

### రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం

### వైసిపికి సిఎం చంద్రబాబు హెచ్చరిక



చిత్తూరు,మే24 'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా..సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి అని సీఎం అన్నారు. జగన్ నంగనాచిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ నోరు తెరిస్తే అన్నీ అబద్దాలేనని విమర్శించారు. మాజీ మంత్రి వివేకా హత్యకేసులో తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. బాబాయ్ హత్యలో తనపై నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు.. జగన్ సన్మానం చేశారని సెటైర్లు గుప్పించారు. తల్లి, చెల్లిని చూడనివారు ప్రజలకు మంచి చేస్తారా..? అని ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిపై గొడ్డలి వేటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని విమర్శించారు. అసత్య ప్రచారాలతో జగన్ అండ్ కో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? అని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకో నాటకమాడుతున్నారని విమర్శించారు. జగన్ అధికార దాహానికి తల్లి, చెల్లి అతీతం కాదని అన్నారు.హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్లతో డ్రామాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. రప్పా.. రప్పా అని జగన్ కటౌట్లకు జంతువుల రక్తం చల్లుతున్నారని విమర్శించారు. తన దగ్గర తోకజాడిస్తే కట్ చేస్తా.. ఇక్కడుంది 1995 నాటి సిబిఎన్ అని ప్రస్తావించారు. జగన్.. ముందు నీ ఇంట్లో సమస్యలు చూసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని చెప్పుకొచ్చారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అని పేర్కొన్నారు.

# కలుపు మందుపై తాత్కాలిక నిషేధం




**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 23 చట్టం ప్రతినిధి :** పారక్వాట్ డై క్లోరైడ్ 24% గా మరియు దాని అన్ని ఫార్ములేషన్స్ పై అమ్మకం, పంపిణీ మరియు వినియోగం పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 60 (అరవై) రోజులపాటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించినట్లు మండల వ్యవసాయాధికారి జీ. భవాని తెలియచేసారు. ఈ నిషేధం 22.05.2026 వ తేదీ నుండి 60 (అరవై) రోజుల రోజులపాటు అమలు లో ఉంటుందని తెలియచేసారు. మండల వ్యవసాయాధికారి ఆగిరిపల్లి లోని రీటైల్ పురుగు మందుల డీలర్లను తనిఖీ చేసి పారక్వాట్ డై క్లోరైడ్ 24% గా కలుపు మందును అమ్మకూడదని తెలియచేసారు. మండలము లోని అన్ని పురుగు మందుల షాపులలో 945 లీటర్లు పారక్వాట్ డై క్లోరైడ్ 24% గా కలుపు మందును ఉందని తెలియచేసారు. ఈ 945 లీటర్లు కలుపు మందును అమ్మకూడదని తెలియచేస్తూ అందరి డీలర్లకు మండల వ్యవసాయాధికారి అమ్మకపు నిలుపుదల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పారక్వాట్ డై క్లోరైడ్ 24% గా కలుపు మందు అత్యంత విషపూరితం మరియూ వ్యాధులకు అవకాశం ఉన్నందున ఈ నిషేధం విధించినట్లు తెలియచేసారు. ఈ పారక్వాట్ డై క్లోరైడ్ 24% గా కలుపు మందు ను ఎవరూ ఉపయోగించవద్దని మండల వ్యవసాయ అధికారి తెలియచేసారు. ఈ కార్యక్రమము లో మండల వ్యవసాయాధికారి జీ. భవాని మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మాక్ పార్లమెంటు నిర్వహణ.




**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం స్టేషన్ నందు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థుల చేత మాక్ పార్లమెంట్ నిర్వహించడం జరిగింది.దీనిలో భాగంగా నిజంగా పార్లమెంట్లో సమావేశాలు ఎలా జరుగుతాయో అలాగే నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రశ్నోత్తరాల సమయం, అదేవిధంగా ఒక బిల్లును ప్రవేశపెట్టడం దాన్ని ఏ విధంగా ఆమోదింప చేయడం.అనే అంశాలను ప్రదర్శిస్తూ నిజమైన పార్లమెంటును తలపించేలా విద్యార్థులు అద్భుతమైనటు వంటి ప్రదర్శనను చేయడం జరిగింది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులకు పార్లమెంట్ మీద అందులో జరిగే సమావేశాల మీద ప్రతి అవగాహన ఉండాలని విద్యార్థులు ఇలాంటి ప్రదర్శన నిర్వహించడం చాలా బాగుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాజు మాట్లాడుతూ ఎండల్లో సైతం విద్యార్థులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాదగిరి, సురేష్ లక్ష్మి కుమారి, శ్రీవిద్య, నాగయ్య ,సమీనా తదితరులు పాల్గొన్నారు.

# మర్యాద, సంస్కారాలు భారత్ నుంచి నేర్చుకోండి

### అమెరికా విదేవాంగ మంత్రికి ఇరాన్ కాన్సులేట్ సూచన

ముంబై,మే24 : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఇరాన్ వ్యంగ్యంగా స్పందించింది. ఇరాన్ ముంబై కాన్సులేట్ సోషల్ మీడియా వేదికగా రుబియోను ఉద్దేశిస్తూ 'భారతీయుల నుంచి కొంచెమైనా మర్యాద, సంస్కారం నేర్చుకోండి' అంటూ ఎక్స్ ఖాతాలో వ్యంగ్యంగా ఓ పోస్ట్ చేసింది. అమెరికా-భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరిచేందుకు మార్కో రుబియో ప్రస్తుతం పర్యటనకు వచ్చారు. యుద్ధం ముగింపు చర్చలు జరుగుతుతన్న ప్రస్తుత తరుణంలో అమెరికాకు చెందిన కొందరు నేతల డిమాండ్లు, ప్రవర్తనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంగా ఉంది. ఇరాన్ తమ డిమాండ్లకు తలొగ్గకుంటే మరోసారి సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు, రక్షణ మంత్రి కూడా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ అమెరికా విదేశంగా మంత్రికి చురక అంటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అంతకు ముందు రుబియో కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు.

# బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఆఫీస్ జాయింట్ సెక్రటరీగా బానోతు పడిత్య నాయక్ నియామకం...



**హైదరాబాద్, మే 23(చట్టం) :** భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఆఫీస్ జాయింట్ సెక్రటరీగా బానోతు పడిత్య నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై అపారమైన నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బానోతు పడిత్య నాయక్, పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. గిరిజన సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రత్యేకంగా ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నేనావత్ రవి నాయక్ గారికి తన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్ గారు, ఎంపీ శ్రీ ఈటెల రాజేందర్ గారు, మాజీ ఎమ్మెల్యేలు శ్రీ ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ గారు, శ్రీ బేతి సుభాష్ రెడ్డి గారు, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ మల్లారెడ్డి గారు, హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి చేతన హరీష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు సహకరించిన హబ్సిగూడ డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు మరియు కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గిరిజన సమాజ అభ్యున్నతి కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# బస్సు సౌకర్యం కల్పించండి డీ.ఎంకి వినతి.



**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** మానుకోట నుండి వయా పెనుగొండ, గూడూరు, నర్సంపేట మీదుగా వరంగల్ వరకు మూడు ఆర్టీసీ బస్సులు ప్రారంభించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం మానుకోట ఆర్టీసీ డీఎంకి వినతిపత్రం ఇచ్చారు. పెనుగొండ,నాయక్ పల్లి లక్ష్మి పురం,బొల్లేపెల్లి గ్రామస్తులు అనేకమంది వరంగల్ కి ప్రయాణం చేస్తుంటారు.వారి సౌకర్యార్థం తక్షణమే బస్సు సర్వీసులు ప్రారంభించాలని డీఎం కి పాలకపక్షం వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెనుగొండ గ్రామ సర్పంచ్ కంకల లక్ష్మీకోమురయ్య, వార్డు సభ్యులు కౌటం ఉపేందర్ నాగేశ్వరి,కాలే సిరి, ముదిగిరి శ్రీను,చాపల రమేష్, కరుణాకర్, తాటి కైలాసం, బొల్లం మహేష్,పొనక సోమరాజు పాల్గొన్నారు.

# పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

### పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం

### రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం

### తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్

హైదరాబాద్,మే24 : తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'..

పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

# ఐకెపి సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు





**పెగడపల్లి, మే 23 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని రాజారాంపల్లి గ్రామంలో ఐ.కె.పి సెంటర్లో రైతన్నలు పోసిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి, ధాన్యాన్ని మిల్లర్లకు తరలించే బాధ్యతను ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ కుమార్, ఎలక్షన్లకు ముందు చెప్పిన విధంగా కటింగ్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయవలసిందిగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో రైతులను రాజును చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే.సీ.ఆర్ గారికి చెందుతుంది. రైతులకు సకాలంలో రైతుబంధువేసి, రుణమాఫీ చేసి రైతుల కళ్ళల్లో ఆనందాన్ని నింపిన ప్రభుత్వం కే.సీ.ఆర్, ప్రభుత్వం. గతంలో ఇక్కడ మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన శ్రీ కొప్పుల.ఈశ్వర్, ప్రతి మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో ఐకెపి సెంటర్లకు పర్యటించి,అప్పుడున్న కలెక్టర్లతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులకు,మిల్లర్ల యజమానులకు సరైన సూచనలు ఇస్తూ రైతులకు నష్టం జరగకుండా చూడడం జరిగింది. అధికారంలో ఉన్న లేకున్నా ఈశ్వర్, ప్రజా నాయకుడిగా,రైతన్నలు పడుతున్న బాధలు తెలిసిన వ్యక్తిగా ఐ.కె.పి సెంటర్లకు వెళ్లి రైతన్నల పక్షాన నిలబడుతున్నారు.

గత ప్రభుత్వంతో అభివృద్ధిలో పోటీపడి,అన్ని వర్గాల వారికి న్యాయం చేసే వరకు బి.ఆర్.ఎస్ పార్టీ పోరాడుతుంది.

అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని,రైతు భరోసా 15000 ఎంతమందికి చేశామో తెలియదని చెప్పిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది రైతన్నలు పడుతున్న ఇబ్బందులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి,నాయకులకు కనిపించడం లేదా. క్వింటాలకు 7.5 కేజీ లు కట్ చేస్తే మీ ప్రభుత్వానికి కనిపించడం లేదా. పండించిన ధాన్యాన్ని సకాలంలో మీరు కొనక పోవడం వల్ల రైతన్నలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉంటున్నారు. ఎన్నడూ లేని విధంగా బస్తాకు రెండు రూపాయలు ఇస్తేనే లోడ్ చేసి తీసుకెళ్తామనడం విడ్డూరం.

ఈ వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేస్తున్నాడో, ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఎందుకు చోద్యం చేస్తున్నారో చెప్పాలి. ఐకెపి సెంటర్ వర్కర్లు ఎవరు కనుసైగల్లో పని చేస్తున్నారు,ప్రభుత్వ వాటా ఎంత,మంత్రిగారి వాటా ఎంతనో రైతన్నలకు చెప్పాలి.

ఇక నుండి అయినా త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి,మిల్లర్లకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి అని డిమాండ్ చేయడం జరిగింది.

లేని యెడల రైతన్నలకు బేషరతుగా క్షమాపణ చెప్పి వ్యవసాయ శాఖ మంత్రి, నియోజకవర్గనికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి తన పదవికి రాజీనామా చేయాలి.

ఈ సందర్భంగా ఇప్పుడున్న మంత్రి గారికి చిన్న విన్నపం, మాజీ కొప్పుల.ఈశ్వర్,ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గశీ ఎంత అభివృద్ధి చెందిందో ప్రజానీకానికి తెలుసు,కావున ఈశ్వర్,విమర్శించే ముందు ప్రతి గ్రామానికి తను చేసిన అభివృద్ధిలో పోటీపడి అభివృద్ధి చేయవలసిందిగా కోరుచున్నాము.ఇట్టి కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు సాయిని,రవీందర్,మండల మాజీ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నాగుల.రాజశేఖర్ గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షుడు బండారి కనకయ్య, సింగిరెడ్డి మల్లారెడ్డి, రాజు నాయక్, శేఖర్ నాయక్,మల్లేశం, తిరుపతి, ప్రభాకర్, కనుకయ్య,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకును వ్యతిరేకిద్దాం పోస్ట్ కార్డు ఉద్యమం

**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం మే 23 చట్టం ప్రతినిధి :** నవజీవన్ బాల భవన్ సొసైటీ ఆధ్వర్యంలో అగిరిపల్లి ౼జ బస్టాండ్ నందు ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా "పోస్ట్ కార్డ్స్ ఉద్యమం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అగిరిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ, పొగాకు వినియోగం ఆరోగ్యానికి అత్యంత హానికరమని తెలిపారు. పొగాకు కారణంగా క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వంటి అనేక ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత పొగాకు బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



అనంతరం పంచాయత్ సెక్రటరీ వరలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల్లో పొగాకు వ్యతిరేక అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎన్. దేవమణి మాట్లాడుతూ, ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న "పోస్ట్ కార్డ్స్ ఉద్యమం" ద్వారా ప్రజలు తమ సందేశాలను ప్రభుత్వానికి మరియు సమాజానికి చేరవేస్తున్నారని తెలిపారు. పొగాకు రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్వరావు మాట్లాడుతూ, పొగాకు వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని తెలిపారు. యువత తమ భవిష్యత్తును కాపాడుకోవాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు "పోస్ట్ కార్డ్స్ ఉద్యమం"లో పాల్గొని, పొగాకు వ్యతిరేక సందేశంతో మొదటి పోస్టు కార్డును పూర్తి చేసి అందజేశారు. అనంతరం ప్రత్యేక పొగాకు వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ జోసెఫ్ విజయ్, మహిళా సంరక్షణ కార్యదర్శి ౼ా.పార్వతి, ౼జ సిబ్బంది, ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొని పొగాకు వ్యతిరేక సందేశాలను పోస్ట్ కార్డుల ద్వారా తెలియజేశారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మిత తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ అధికారులు

**ఎండపల్లి మే 23 చట్టం. :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి , మారేడుపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ . బి.ఎస్ లత మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిం చాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన





వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిల్లు వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండపల్లి తహసిల్దార్ అనిల్ , ఎంపీడీవో కృపాకర్, సివిల్ సప్లై ఎఫ్ఐ స్వామి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో మరణించిన కుటుంబాలకు 10 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలి.

### గొడిషాల వెంకన్న సిపిఎం పార్టీ మండల కార్యదర్శి.

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని సీనియర్ అసిస్టెంట్,శంకర్ లాల్ కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇవ్వడమైనది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ కేసముద్రం మండలం అర్పణ పల్లి గ్రామంలో గత కొన్ని రోజుల నుండి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతా ఉన్నవి పనిలో భాగంగా ఈనెల 19న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న నేరెళ్ల సోమయ్య ( లేట్ )సన్నాఫ్ రామయ్య కు పని ప్రదేశంలో ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తాకడంతో ఇంటికి వచ్చిన సోమయ్య అవస్థకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన మహబూబాబాద్ లోని ఏరియా హాస్పిటల్ కి తరలించిన అనంతరం చికిత్స పొందుతూ మృతి చెంది నాడు,రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకొని కుటుంబానికి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసే చోట టెంటు సౌకర్యం మజ్జిగ ప్యాకెట్లు చల్లని నీళ్లు అందించాలని వడదెబ్బతో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు జల్లే జయరాజు, నేరెళ్ల మురళి, మంజుల ,ముఖేష్ పాల్గొన్నారు.



# సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

### వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత

**హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ):** సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

# అవగాహన సదస్సు



**కర్నూల్, చట్టం న్యూస్ (23 మే 2026):** రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి జిల్లా కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు బాల్య వివాహ నిరోధక చట్టం పై పురోహితులకు పాస్టర్స్ కు గవర్నమెంట్ కాజి లకు, ఎన్జీవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు లో జడ్జి మాట్లాడుతు ఎవరైనా గాని బాల్య వివాహాలు చేయమని మీ దగ్గరికి వస్తే మీరు సంబధిత శాఖ లకు గాని 15100, 1098 టోల్ ఫ్రీ నెంబర్స్ కు తెలియ జె స్తే వెంటనే ఆ వివాహాన్ని అపి వేస్తామని తెలిపారు. అలాగే కొత్త చట్టాల ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష కలదని తెలిపారు. ఐసీడీస్ ఆఫీసర్ శారద మాట్టాడుతూ ప్రతి గ్రామములో గ్రామ కమిటీ లు కలవని వారికి బాల్య వివాహ లపై సమాచారం యిస్తే వెంటనే వారు ఆ వివాహన్ని అపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తారని తెలిపారు. కర్నూలు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన గారు మాట్టాడుతూ బాల్య వివాహ లపై సమాచారం తెలిస్తే వెంటనే మహిళ పోలీసు లకు మరియు ఐసిడిఎస్ ఆఫీసర్లకు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు.చిన్న పిల్లలకు వివాహాలు చేయడం వలన వచ్చే అనారోగ్య సమస్య లను గురించి వివరించారు. బాల్య వివాహలు చేసిన వారికి మరియు చేయించిన వారికి కఠిన శిక్షలు కలవని తెలియజేశారు.ఈ సదస్సు లో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ పురోహితులు పాస్టర్స్ గవర్నమెంట్ కాజీలు మరియు ఎన్జీవోస్ తదితరులు పాల్గొన్నారు.



## చెరువుల మట్టి, దోపిడీకి గురి కాకుండా , కాపాడలి,రైతుల పొలాలకు చేరవేయండి ;

### అక్రమార్కులపై చర్యలు తీసుకోండి ;





**బోయిన్ పల్లి మండలం / మే 23 ,(చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం విలాసాగర్ చెరువుని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. విలాసాగర్ పెద్ద చెరువు, అలాగే వరద వెళ్లి గ్రామపంచాయతీ ఆమ్లెట్ గ్రామం దుబ్బపెల్లి చిట్కుచెరువులో వెలికితీస్తున్నమట్టినీ ప్రభుత్వమే దగ్గరుండి చెరువు రాగడి మట్టి (బంగారం), రైతుల పొలాలకు పోసుకునే విధంగా వెసులుబాటు కల్పించి, అలాగే ఇటుక బట్టి యాజమాన్లు ఎవరైతే ఉన్నారో పర్మిషన్ పేరుతో మట్టిని తరలించడంలో సమయపాలనను తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి, సాయంత్రం 6 గంటల వరకే తీసుకో పోవాలని నిబంధనను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా చెరువులోని మట్టిని తోడేస్తున్నారు. అలాగే పర్మిషన్ ఇచ్చిన లారీలను కాకుండా, పర్మిషన్ లేని లారీలలో కూడా మట్టి లోడింగ్ చేస్తూ,నిబంధనలను అతిక్రమిస్తున్న మట్టి కాంట్రాక్టర్ ఎవరైతే ఉన్నారో అతనిపై చర్యలు తీసుకొని, అలాగే,లారీ యజమానులపై, చర్యలు తీసుకోవాలని చెరువులో మట్టిని కాపాడాలని రైతాంగం పక్షాన పత్రికముఖంగా బోయిన్పల్లి మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ విజ్ఞప్తి,చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రామాంచ అశోక్, తదితరులు పాల్గొన్నారు..

# పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

### ముగ్గురు రిమాండ్.

**మహబూబాబాద్ జిల్లా చట్టం న్యూస్/కేసముద్రం :** పోలిసుల విధులకు ఆటంకం కలిగించిన,నలుగురు వ్యక్తులపైన కేసు నమోదు ముగ్గురి రిమాండ్ కేసముద్రం ఎస్సై కే .క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22.రోజున రాత్రి 10.00 గంటలకు ఆర్ సదయ్య ఏఎస్ఐ కేసముద్రం తన పై అధికారుల ఉతర్వుల మేరకు కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూన్న ఏఎస్ఐ పైన రాత్రి 11.00 గంటలకు పెనుగొండ క్రాస్ వద్ద మద్యం సేవించి ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులు దాడి చేసినారు.పోలీస్ వారి యొక్క విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపైన ఆర్ సదయ్య ఏఎస్ఐ దరఖాస్తు ఇవ్వగా కేసముద్రం ఎస్సై కే.క్రాంతి కిరణ్ కేసు నమోదు చేసి ఈ నెల 23 న అట్టి దాడికి పాల్పడిన 1) ధరావత్ వినోద్ తండ్రి బాలు,వయసు: 26 సం,వృత్తి,ఆటో డ్రైవర్ చెరువు ముందుతండా, మర్రి తండ 2) ధరావత్ గణేష్ తండ్రి లాలూ,వయసు 19 సం, వృత్తి,విద్యార్థి, చెరువు ముందు తండా,3)గుగులోతు రాకేష్ తండ్రి శంకర్,వయసు: 22 సంవత్సరాలు,వృత్తి: కాంక్రీట్ పని (కూలీ) గుర్రాల గుట్ట తండా,ఉత్తర తండ, 4) ధరావత్ యాకూబ్ తండ్రి దేవ్ సింగ్,వయస్సు: 24 సం,గా ఎస్సై వివరాలు తెలిపారు.



## పిల్లలు - పెంపకం



పిల్లలతో మంచిగా మెలగండి
వారిపై ఆజ్ఞలు జారీ మానండి
ప్రశ్నలు అడిగి కోపం పడకండి
ప్రేమగా పిల్లలతో మాట్లాడండి!

పనులన్నీ ఒక్కసారే చెప్పకండి
అమోమయానికి గురిచేయకండి
అర్థం అయ్యేలా వారికి చెప్పండి
పిల్లలకు అవకాశాలు కల్పించండి!

పిల్లలపై వత్తిడి అస్సలు తేకండి
వారికి తగిన సమయం ఇవ్వండి
ప్రశాంతంగా పని చేయనివ్వండి
వారికి మీ సహకారం అందివ్వండి!

విషయాన్ని సూటిగా తెలపండి
పిల్లలపై కేకలు వేయుట మానండి
కొట్టుట, తిట్టుట అనేవి వద్దండీ
ఓర్పు, నేర్పులను అలవర్చుకోండి!

పిల్లలను ఎల్లపుడూ ప్రేమించండి
మంచి చేస్తే వారిని అభినందించండి
బహుమతులు తెచ్చి వారికివ్వండి
పిల్లల ప్రేమను చక్కగా పొందండి!

చదువుతూ పిల్లల్ని చదివించండి
తప్పు చేస్తే నెమ్మదిగా తెలపండి
పిల్లలతో కొంత సమయం గడపండి
పిల్లలే మన సంపదని మరువకండి!

పిల్లల బాధను అర్థం చేసుకోండి
పిల్లలను ఒక కంట గమనించండి
సెల్ ఫోనుకు బానిస కానివ్వకండి
వారి బాధ్యత మనదేనని మరువకండి!

పిల్లలకు మంచిచెడులు తెలపండి
చిన్న చిన్న పనులు చేయడం నేర్పండి
వారి ఆలోచన, ఆసక్తులను గమనించండి
పిల్లలను చాలా జాగ్రత్తగా పెంచండి!

ఈ.వి.వి.ఎస్. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



## బిడ్డా !



బిడ్డా నేనాపీసర్నీ చూస్తా
బిడ్డా నేనాపీసర్నీ చూస్తా
పొట్టిగుండ పోడుగ్గుండ
నల్లగుండ తెల్లగుండ
సన్నగుండ లావుగుండ
అసలు మనసున్న మనిషేనా చూస్తా!
“ బిడ్డా నేనాపీసర్నీ చూస్తా”
మాతతది మన కులమే
మా నానది ఈ కులమే
నీ కులం చెప్పనీకే వాడెవడో చూస్తా
“ బిడ్డా నేనాపీసర్నీ చూస్తా”
అమ్మననను ఆలిననను
అక్కనను
చెల్లినను
ఇజ్జత్ గానే అడుగుతా
మన కులం గురించి వాడికి తెలుపుతా
“ బిడ్డా నేనాపీసర్నీ చూస్తా”
కులం లేని
మతం లేని
సమాజానికి నడుద్దాం
నీవు నేను ఏకమై
కుల కూకటి వేళ్లతో కూల్చేద్దాం
“ బిడ్డా నేనాపీసర్నీ చూస్తా”

డాక్టర్.ఎస్.
విజయ భాస్కర్,
అధ్యక్షులు,
హైదరాబాద్ ఓల్డ్ సిటీ రైటర్స్ అండ్
కల్చరల్ అసోసియేషన్ (హౌకా)
సైదాబాద్,
హైదరాబాద్

## శ్రీరామ కీర్తన (గేయం)



శ్రీరఘురామా సీతాపతే,
శ్రితజనపాలక పుణ్యచరితే!
అయోధ్యాపుర భాగ్యవిధాతా,
ఆశ్రిత రక్షక లోకత్రాతా!

దశరథ నందన ధార్మికమూర్తి,
దిక్కుల నిండిన పావనకీర్తి!
కౌసల్యాత్మజ కోదండపాణి,
కమలనేత్రుడే కరుణాఖని!

సత్యవాక్య పరిపాలన శీలా,
సకలజనార్చిత సాత్వికలీలా!
లక్ష్మణసేవిత లలితస్వభావా,
లక్ష్మీవల్లభ భక్తశుభేవా!

భరతశత్రుఘ్న ప్రాణసమానా,
భూరిదయామయ భవ్యనిధానా!
సుగ్రీవార్చిత సుందరరూపా,
సురుచిరగుణగణ సూర్యప్రతాపా!?

హనుమత్సేవిత అంబుజనాభా,
అవనిని బ్రోచిన అమితప్రభావా!
రావణమర్దన రణధీరా,
రాజీవాక్షా రఘుకులవీరా!

మంగళమూర్తివి నీవే రామా,
మము రక్షించెడి దివ్యనామా!
సదా నీ స్మరణే ముక్తికి మార్గం,
నీ చరణ శరణే మాకు స్వర్గం!?

తెలికిచెర్ల రాజ కృష్ణ కామేశ్వర రావు
రిటైర్డ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్,
భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ,
ఇస్రో, షార్, శ్రీహరికోట
సూళ్లూరుపేట / తిరుపతి జిల్లా



## సమాజం కై



నీ స్వార్థాన్ని తెంచు
నీ కోపాన్ని తుంచు
నీ ప్రేమను పంచు
నీ మంచిని పెంచు
నీ మానవత్వాన్ని తెల్పు
మానవ జాతిని నిల్పు
జై హింద్...

డాక్టర్, కందుల సుధాకర్,
సేవరత్న తెలంగాణ కేసరి
ఉ సోషల్ పార్మర్
స్వర్ణ నంది
అవార్డు గ్రహీత,
మానవ విలువల
సందేశకుడు,
ఖమ్మం జిల్లా,
9390708322

## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు గడ్డం లింగస్వామి కి ఆహ్వానం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా జూన్ 6, 7న చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు నల్గొండ జిల్లా దోమలపల్లి కి చెందిన కవి గడ్డం లింగస్వామికి ఆహ్వానం అందించారు.మహాసభలకు దేశ విదేశాల నుంచి ప్రముఖ కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు, భాషాభిమానులు హాజరవుతారన్నారు. అలాంటి సభలకు తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందన్నారు.

## ఓ బొజ్జ గణపయ్య (ఇష్టపదులు )



1.
నవ్వు ముఖంబు తోడ, నాల్గు కరముల తోడ,
కీర్తించగ భక్తులు నర్తించు గణేశుడు,
చింతలను తొలగించు చేతి లోని పాశము,
కాయ పోషణం బగు కరములో మోదకము,
ఆనందంబు నిచ్చెడి అరవిందమును గల్గి,
అడ్డగింతల నాపు అంకుశం బొక చేత,
విఘ్నేశు రూపంబు విచిత్రంబుగ నుండి
విజ్ఞానంబు నిచ్చు విరివిగాను “కృష్ణా”!!

2.
వివేకమునకు చిన్నె వినాయకుని వీనులు,
బ్రహ్మాండ కాయంబు భ్రాంతిని తొలగించును,
కర్వపు వాహనంబు గర్వంబు తొలగించు,
చేతి లోని దినుసులు చింతలను తొలగించు,
వినాయక తత్వంబు విఘ్న నాశనంబై
వేదాంతమును దెల్పి విజయంబును గూర్చుగ,
గజవదనంబు దెల్పు గమ్య విధానంబును,
వినాయకు నర్చనము వినుత మగును
“కృష్ణా”!!

డాక్టర్ కురవి వేంకట కృష్ణ శాస్త్రి, చెన్నై

## జీవితం అంటే అది మరి.....

అది అర్థం కాన్నంత వరకు బ్రహ్మాండం ఆనందం చెప్పుకోలేని సంతోషం ఆహ్లాదం మరుపు రాని మనోహరం

జరుగుబాటు జరిగిపోతు ఉంటే తాడబాటు ఉండదు అర్థమే కాదు

అంతా ఇంతే అనుకుంటాం ముఖం వేల బల్బుల కాంతులు వెలుగు

స్థితిగతులు తారుమారు అవుతూ
తీరా నెమ్మనెమ్మదిగా అర్థం అయ్యే కొద్ది

విచారం చెప్పుకోలేని విషాదం తట్టుకోలేని సుడిగండం ఐసు ముక్క కరిగి మాయం అవునట్లు ఇనుప ముక్క కొలిమిలో ఎర్రగా మండుతున్నట్లు భగభగ సెగలు తాకు

ఇంతకు అది ఏమిటో తెలుసా అదే జీవితం అన్నీ తట్టుకుని దాటుకుని సాఫీగా వస్తే జీవితం హ్యాపీ అద్భుతం

అలా కొనసాగితే మనిషి ఖుషిగా ముందుకు వచ్చాడా ఖుషి లేకపోతే వెర్రి బాగులోడు

అందుకే అవకాశాలు అంది పుచ్చుకోవాలి విచ్చలవిడి తనం వదలుకోవాలి పొగరు వదలాలి.

రచన....సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్
కావలి చురకశ్రీ నెల్లూరు జిల్లా.



## నమ్మకమే మనిషికి అసలైన ఊపిరి

మనిషి జీవితం నమ్మకం
పునాదుల మీద సాగుతుంది
వ్యక్తుల మధ్య ఉత్పత్తి దారుల
మధ్య ఉన్న నమ్మకమే వ్యాపార
అభివృద్ధికి ఊతంగా నిలుస్తుంది

నమ్మకం వమ్మైతే జీవితం
సమస్యల సుడి గుండమై
అర్ధాంతంగానే ముగిసిపోతుంది

దంపతుల మధ్య నమ్మకమే
సంసార రథాన్ని నడిపిస్తుంది
వ్యక్తుల మధ్య కోరికల
ఏకీకరణ నమ్మకానికి
దారి చూపుతుంది

ఇంటికి పునాది ఎంత ముఖ్యమో
బంధానికి నమ్మకం అంతే ముఖ్యం
గుండెల్లో నిజాయితీ లేకపోతే
మనుషుల మధ్య మమకారం
మిగలదు ఆర్ధత అంతరిస్తుంది

నమ్మకం కోల్పోయిన మనిషి
జీవితం అనుమానపు ముళ్ళ
బాటలో సాగే పయనం లాంటిది
నరకానికి ప్రతి రూపమైవేధిస్తుంది

నమ్మకమే మనిషికి
నిజమైన ఊపిరి
నాణ్యతతో చేసే పనులతోనే
నిజమైన వెలుగు వస్తుంది

నమ్మకం నాణ్యత లేని
జీవితం వృదా భరితం
ఆందోళనలకు నిలయం

మాట ఇస్తే తప్పని వ్యక్తిత్వం
నమ్మకానికి నిలువెత్తు రూపం
మాటల్లో చూపే మోసాలు కాదు
చేతుల్లో చూపే నమ్మకమే
నిన్ను సమాజంలో స్ఫూర్తిగా
నిలుపుతుంది

ఊపిరి లేనిదే మనిషి బతుకడు
ఉనికి లేనిదే గుర్తింపు రాదు
నమ్మకం నాణ్యతతోడుంటే
నీ కీర్తి ఎప్పటికీ చెడిపోదు

నమ్మకం అనే వృక్షాన్ని పెంచుదాం
మోసం కుట్రలు లేని వికసిత
భారత్ లక్ష్య సాధనకు
అంకితమై భారత కీర్తి
ప్రతిష్ఠలు పెంచుదాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కాలమిస్ట్ రచయిత
కరీంనగర్
9440245771



## గోవా శతాధిక కవి సమ్మేళనంలో పోలయ్య కవి కూకట్లపల్లికి ఘనసన్మానం

### “గోవా కడలి కవి రత్న” బిరుదు ప్రదానం...



ఎకె తెలుగు మీడియా ఎఫ్ టాం...
ముంబై భారతి సంస్థల వ్యవస్థాపకులైన అశోక్ కంటే... జగన్ బాబు...అంబల్ల జనార్దన్ సంయుక్త ఆధ్వర్యంలో...
తూలాల సవరమ్మ విశ్రాంత డిప్యూటి కలెక్టర్ అధ్యక్షతన...గోవాలో “గ్రాండియర్ డి సాంచి” స్టార్ హోటల్లో (19.05.2026 ) 7 రాష్ట్రాల నుంచి వచ్చిన కవులతో
“గోవా శతాధిక కవి సమ్మేళనం” సభ ఘనంగా జరిగింది

ప్రముఖ కవయిత్రి గాయని డా.బండారు సుజాతా శేఖర్ వ్రాసిన మట్టిగీతం పుస్తకాన్ని అంబల్ల జనార్ధన్ ఆవిష్కరించి సమీక్ష చేశారు...
కవులకు ముందుగా సన్మానం చేశారు
తదనంతరం కవులు కవితాగానం చేశారు

ఈ సందర్భంగా హైదరాబాద్ అత్తాపూర్ నివాసి విశ్రాంత ఆంధ్రా బ్యాంక్ అధికారి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి...వందనం అభివందనం శీర్షికన...కవితాగానం చేస్తూ...

తెలుగు భాషకు పట్టాభిషేకం చేసిన... తెలుగుజాతి ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించిన... ఆంధ్రుల ఆరాధ్య దైవం... అన్న...ఎన్టీఆర్ నుండి ప్రపంచ వ్యాప్తంగా మారుమ్రోగి ఆస్కార్ అవార్డు గెలుచుకున్న “నాటు నాటు” తెలుగు పాట రచయిత చంద్రబోస్ వరకు...

ప్రతి ఒక్కరినీ స్మరిస్తూ అందరికీ
“వందనం అభివందనం” అంటూ
చేసిన కవితాగానం సభికులను
అలరించింది. ఆనంద పరవశుల్ని
చేసింది. చప్పట్లతో హాల్ మారుమ్రోగింది.

ఈ సందర్భంగా అనతి కాలంలోనే 5000 కవితలు వ్రాసి సాహితీ సేవ చేస్తున్నందుకు గుర్తింపుగా పోలయ్య కవి కూకట్లపల్లికి ఎకె తెలుగు మీడియా వ్యవస్థాపకులు అశోక్ కంటే...ఎఫ్ టాం అధ్యక్షులు జగన్ బాబు...ముంబాయి భారతి వ్యవస్థాపకులు అంబల్ల జనార్ధన్...




“గోవా కడలి కవిరత్న” బిరుదు ప్రదానం చేసి, మెమోంటో శాలువా సర్టిఫికెట్ లతో ఘనంగా సన్మానించారు...పోలయ్య కవి కూకట్లపల్లి అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

తరువాత రెండు రోజులు కవులందరికి గోవా టూర్ అరేంజ్ చేశారు.గోవా తెలుగు గవర్నర్ శ్రీ అశోక్ గజపతి గారితో భేటీ స్నాక్స్ ఫోటో కార్యక్రమం... రెండు గుళ్ళు రెండు బీచ్ లు ఒక కోట ఒక చర్చి బోటింగ్ మరియు కవులందరికీ స్టార్ హోటల్లో చక్కనివసతి భోజనాలు ఏర్పాటు చేశారు

త్రిమూర్తులు అశోక్ కంటే జగన్ బాబు జనార్దన్ గార్లు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి గోవా కవిసమ్మేళనం మరియు గోవా టూర్ ను సమర్థవంతంగా నిర్వహించి ఘనవిజయం చేసినందుకు కవులు వారికి మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు

కవులకు “గోవా శతాధిక కవి సమ్మేళనం” “ముదు రోజుల పండుగలా” ముగిసింది మరిచిపోలేని ఓ తీపిజ్ఞాపకంగా మిగిలింది




# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు

## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం



'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# నాగార్జునకు మే 23 స్పెషల్


**తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు**

**తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని**

**అగ్ర కథానాయకుడు నాగార్జున**

అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# 200 కోట్లు రాబట్టిన కరుప్ప





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.

-----

# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

**బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేక పోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బడ్జెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన




డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

## త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త




ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగు తున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



# చట్టం స్పోర్ట్స్



## విరాట్ కోహ్లీపై నెటిజన్లు ఫైర్!

హైదరాబాద్ వేదికగా ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగిన మ్యాచ్ వన్‌సైడెడ్‌గా సాగినా గ్రౌండ్‌లో జరిగిన డ్రామా మాత్రం చర్చకు దారితీస్తోంది. కోహ్లీ బ్యాటింగ్ చేసినప్పుడు హెడ్ కవ్విస్తూ కామెంట్స్ చేశాడు. అప్పుడే విరాట్ సీరియస్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా హెడ్ షేక్ హ్యాండ్ ఇస్తే పట్టించుకోకుండా విరాట్ వెళ్లిపోయాడు. ఇప్పుడు దీన్నే నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఇది అహంకార పూరితమైన ప్రవర్తన అని కామెంట్స్ చేస్తున్నారు. ఉప్పల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెన్ అభిషేక్ శర్మ(56) ఇషాన్ కిషన్(79) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (51) తన స్టైల్‌లో ఇన్నింగ్స్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు హైదరాబాద్ బ్యాటటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ సమయంలో అసలు డ్రామా మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉన్నప్పుడు చాలా దూకుడుగా కనిపించాడు. వరుసగా ఫోర్లు బాదిన తర్వాత కోహ్లీ ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ ట్రావిస్ హెడ్‌ను ఉద్దేశించి వచ్చి బౌలింగ్ చేయ్ అన్నట్టు కామెంట్ చేశాడు. దీనికి సమాధానంగా హెడ్ కేవలం చిరునవ్వుతోనే బదులిచ్చాడు. అయితే ఈ మాటల యుద్ధం కోహ్లీకి కలిసి రాలేదు. కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టింది." వచ్చాడు, బౌలింగ్ చేశాడు, వికెట్ పడగొట్టి వెళ్లిపోయాడు" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రావిస్ హెడ్ బౌలింగ్‌కు వచ్చి ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీశాడు. కోహ్లీ హెడ్‌ను బౌలింగ్ చేయమని సవాల్ చేసినందున ఈ పోస్టు కోహ్లీని ఉద్దేశించిందేనని అభిమానులు భావిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ కోపం తగ్గలేదు. పెవిలియన్ నుంచి వస్తూ అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు కోహ్లీ. కానీ ట్రావిస్ హెడ్‌తో చేతులు కలపకుండా పక్కకు తప్పుకొని వెళ్లిపోయాడు. దీనికి హెడ్ కూడా షాక్ అయ్యి నవ్వి ముందుకెళ్లిపోయాడు. దీనిపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మైదానంలో జరిగిన విషయాలను ఇలా సీరియస్‌గా తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో రిటైర్ కాబోతున్నా కూడా మెచ్యూరిటీ రాలేదా అని ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరు కోహ్లీ అహంకారపూరితంగా వ్యవహరించారని అంటున్నారు. ఆ వ్యక్తి యాటిట్యూడే అలా ఉంటుందని, నచ్చితే మాట్లాడుతాడు లేకుంటే అసలు పట్టించుకోడని అంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో బెంగళూరు విఫలమైంది. దీంతో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆర్సీబీ తరఫున వెంకటేష్ అయ్యర్ 44 పరుగులు, రజత్ పాటిదార్ 56 పరుగులు, కృనాల్ పాండ్యా 41 పరుగులు చేశాడు. ఈ ఓటమి బెంగళూరుకు పెద్దగా నష్టం చేయలేదు. మెరుగైన రన్‌రేటు కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ టాప్2లో ఉంది. నేరుగా క్వాలిఫైయర్ 1కు అర్హత సాధించింది. క్వాలిఫైయర్ 1లో గుజరాత్‌టైటాన్స్‌తో తలపడనుంది.



## లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ

రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్?కు స్పెషలే. మరోసారి దీనిని హిట్?మ్యాన్ నిరూపించుకున్నాడు. ఇంతటీ బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్?కు రోహిత్ 'సారీ'? చెప్పాడు. తనను కలవలేకపోయానని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్?కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవధుల్లేకుండా పోయాయి!కోల్?కాతా ఈడెన్ గార్డెన్స్?? వేదికగా ముంబయి రీసెంట్?గా కేకేఆర్?తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్?ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్?మ్యాన్?ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్? దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ అమ్మాయి ఏడవడం రోహిత్?ను కలచివేసినట్లుంది. దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్?మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్?లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్స్ ఈడెన్ గార్డెన్స్?కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్? రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్? స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్?మ్యాన్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చదని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఇక ప్రస్తుత ఐపీఎల్? సీజన్?లో ముంబయికి ఇంకా ఒక మ్యాచే మిగిలింది. ఆదివారం (మే 24) మధ్యాహ్నం 3.30 గంటలకు రాజస్థాన్ రాయల్స్?తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్?కు ముంబయి వాంఖడే స్టేడియం వేదిక కానుంది. ఇది ముంబయికి పెద్దగా అవసరం లేకున్నా, రాజస్థాన్?కు మాత్రం కీలకమైన మ్యాచ్. ప్లేఆఫ్స్?కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిందే! ప్రస్తుతం 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ 16 పాయింట్లతో బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఓడితే పంజాబ్ కింగ్స్, కోల్?కతా నైట్?రైడర్స్?కు ఛాన్స్ ఉంటుంది. రోహిత్ ఈ మ్యాచ్?లో బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా 8 మ్యాచ్?లు ఆడిన హిట్?మ్యాన్ 283 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50o స్కోర్లు నమోదు చేశాడు. ఇక ఆఖరి మ్యాచ్?లో రాజస్థాన్?పైనా భారీ ఇన్నింగ్స్?తో చెలరేగిపోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్ తప్పితే మళ్లీ వచ్చే ఏడాదే రోహిత్ టీ20ల్లో కనిపిస్తాడు.

## రజత్ పాటిదార్ అరుదైన ఘనత..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగంగా బంతుల పరంగా 100 సిక్సర్లు కొట్టిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్‌లో హర్షల్ పటేల్ పటేల్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి ఈ ఘనతను సాధించాడు.ఐపీఎల్‌లో 100 సిక్సర్లు పూర్తి చేయడానికి పాటిదార్‌కు 933 బంతులు బంతులు అవసరం అయ్యాయి. ఇంతకముందు ఈ రికార్డు శివమ్ దూబె పేరిట ఉంది. అతడు 100 సిక్సర్లు కొట్టేందుకు 992 బంతులు తీసుకున్నాడు. ఇక ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో పాటిదార్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తరువాతి స్థానంలో నికోలస్ పూరన్ ఉన్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో 39 బంతులు ఎదుర్కొన్న రజత్ పాటిదార్.. 6 ఫోర్లు, 1 సిక్స్ సాయంతో 56 పరుగులు చేశాడు.



## రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు భారీ ఊరట



గత కొంతకాలం నుంచి వివాదాల్లో చిక్కుకున్న భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. మే 30 నుంచి జరగనున్న ఏషియన్ గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు మహిళా రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా రెజ్లర్లను దూరం పెట్టడానికి మాతృత్వం (తల్లి కావడం) ఒక ప్రాతిపదిక కాకుండా చట్టం చూసుకుంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఆసియా క్రీడలకు భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్దేశించిన ప్రమాణాలు వివక్షపూరితంగా ఉన్నాయని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక మహిళా రెజ్లర్ గర్భధారణ, ప్రసవానంతర కాలం నాటి ప్రయాణం అసాధారణమైన శారీరక సవాళ్లతో కూడి ఉంటుందనే విషయాన్ని తిరస్కరించలేమని హైకోర్టు పేర్కొంది. అయితే దీని తీవ్రతను క్రీడా రంగంలో తరచుగా గుర్తించరని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను దూరం పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'వినేష్ ఫోగాట్ ప్రసూతి సెలవులో ఉన్నందున భారత రెజ్లింగ్ సమాఖ్య మినహాయింపు సెలక్షన్ పాలసీని పూర్తి చేయలేకపోయారు. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను బహిష్కరించడానికి లేదా పక్కన పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని' ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కూడా ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ చర్యను ద్వేషపూరితమైనదిగా కోర్టు అభివర్ణించింది. ఆమె విషయంలో పదాల ఎంపికపై సైతం కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వైపు నుంచి దురుద్దేశం ఉందని స్పష్టంగా అర్థమవుతోందని కోర్టు వ్యాఖ్యానించడం హాట్ టాపిక అవుతోంది. 2025లో మెడల్స్ గెలిచిన వారికే అర్హతను పరిమితం చేసేలా నిబంధనలు ఉన్నాయని ధర్మాసనం తప్పుపట్టింది.

## సన్ రైజర్స్ ఐపీఎల్ టైటిల్ సాధించేనా?



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంది. ఆదివారం జరిగే డబుల్ హెడర్ పోరుతో లీగ్ దశ ముగియనుంది. ప్రస్తుతం మరో మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. శనివారం పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లు తలపడతాయి. ఇక ఆదివారం జరిగే డబుల్ హెడర్‌లో కేకేఆర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్తాన్ రాయల్స్‌తో ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుకున్నాయి. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు టాప్ 2లో నిలిచాయి. ఇక ఆర్సీబీపై తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గినా మెరుగైన నెట్ రన్ రేట్ లేకపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. టాప్ 2లో నిలిచిన జట్లకు ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు ఉంటాయి.ఇక 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాలంటే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గాల్సిందే. అయితే ఇలాంటి స్థితిలో నిలవడం సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇదేం తొలిసారి కాదు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితినే సన్ రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంది. 2016 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్.. ఆర్సీబీ జట్లు వరుసగా టాప్ 2లో నిలిచాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు.. కేకేఆర్ 4వ స్థానంలో నిలిచాయి. క్వాలిఫయర్ 1లో గుజరాత్ లయన్స్‌పై ఆర్సీబీ నెగ్గి ఫైనల్ చేరగా.. కేకేఆర్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో గుజరాత్ లయన్స్‌పై నెగ్గింది. అనంతరం ఫైనల్లో ఆర్సీబీని ఓడించి టైటిల్ సాధించింది. ఆ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా ప్లేయర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు.ఈసారి కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఉన్నాడు. 2016లో మాదిరే ఈసారి కూడా ఆర్సీబీ, గుజరాత్, సన్ రైజర్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరాయి. కేకేఆర్ రేసులో ఉంది. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరితే అచ్చం 2016 సీజన్‌లానే ఉంటుంది. 2016 సెంటిమెంట్ వర్కౌట్ అయితే ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్ రైజర్స్ హైదరాబాద్ కప్పు నెగ్గడం ఖాయం.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మే 27న జరిగే ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా డిసైడ్ కాలేదు. ప్రస్తుతం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డిలు సూపర్ టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ కూడా మెరుగైంది. ప్యాట్ కమిన్స్, సకీబ్ హుస్సేన్, ఈషాన్ మలింగలు లయలో ఉన్నారు.వీరు క్వాలిఫయర్స్‌లో కూడా రాణిస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడం ఖాయం. ఆర్సీబీతో మరోసారి పోరు జరిగితే మాత్రం అభిమానులు పండగ చేసుకోవడం ఖాయం. మే 31న అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ జరగనుంది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999